# ఆషాఢభూతి



అనగనగా దేవశర్మ అని ఒక స్వాముల వారు ఉండేవారు. భక్తులు ఆయనకి సేవలు చేసి పళ్ళు, ఫలాలు, దక్షిణ తాంబూలాలు ఇస్తూ ఉండేవారు. మన దేవశర్మ గారు ప్రసాదాలు, ఫలాలు , పళ్ళు అన్నీ పంచిపెట్టి డబ్బులు మటుకు దాస్తూ ఉండేవాడు. అలా ఆయన దగ్గర చాలా వెండి నాణాలు చేరాయి. అలా చేరిన వన్నీ ఆయన తన దగ్గర ఉన్న బొంతలో వేసి కుట్టి దాచి పెట్టాడు.

ఈ సంగతి ఎవరికీ తెలీదు అని అనుకుంటూ ఉండగా , ఆషాఢభూతి అనే ఒక యువకుడు ఈ సంగతి కనిపెట్టాడు. ఎలాగయిన ఆ డబ్బులు అన్నీ దోచుకుని పోవాలి అని ఎత్తు వేసాడు.

ఒకపూట దేవశర్మ భక్తులందరూ వెళ్ళిపోయాక విశ్రాంతి తీసుకుంటూ ఉండగా ఆషాఢభూతి ఆయన దగ్గరికి వచ్చి అతి వినయం ప్రదర్శించి మొత్తానికి తను ఆయన దగ్గర శిష్యుడిగా చేరేందుకు ఆయనని ఒప్పించాడు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

సరే అలా కొద్ది రోజులు అయ్యాక గురుశిష్యులు ఇద్దరూ కలిసి ఒక ఊరి నుంచి ఇంకో ఊరికి వెళ్తూ ఉండగా, కొంత దూరం వెళ్ళాక ఆషాఢభూతి " గురుగారు, పెద్ద ఘోరం జరిగిపోయింది. నిన్న రాత్రి మన పడుకున్న వారి ఇంట్లో నుంచి ఒక చీపురుపుల్ల నా సంచికి అంటుకుని వచ్చింది. పరుల సొమ్ము నేను పూచిక పుల్ల కూడా ముట్టుకోను, అది పాపం కాబట్టి నేను ఇప్పుడే వెళ్ళి వారి పుల్ల వారికి ఇచ్చేసి వస్తాను" అని కొంత దూరం వెళ్ళి ఆ చీపురుపుల్లని పక్కన పడేసి మళ్ళీ గురుగారి వద్దకి వచ్చాడు.

ఇది అంతా చూసిన గురుగారు "ఆహా నీలాంటి వాడు నాకు శిష్యుడు అవటం నా అదృష్టం" అని ఉప్పొంగిపోయాడు.

సరే అలా నమ్మకం సంపాదించుకున్న మన ఆషాఢభూతి , గురుగారి దగ్గరినుంచి ఎలా ఆ డబ్బుల బొంత కొట్టెయ్యాలా అని ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఒక రోజు ఇద్దరూ అడవి మార్గంలో నడచి వెళ్తూ ఉండగా సాయంకాలం అవటంతో , గురుగారు సంధ్యావందనం చెయ్యటానికి అక్కడే ఉన్న చెరువులో దిగబోతూ తన డబ్బుల బొంత, ఇతర సామాగ్రిని నమ్మకంతో ఆషాఢభూతికి ఇచ్చాడు.

ఇక ఇదే అవకాశమని గురుగారు సంధ్యావందనం ముగించుకునేలోపల మన ఆషాఢభూతి ఆ డబ్బుల బొంత తీసుకుని పారిపోయాడు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

చూశారా పిల్లలూ నమ్మక ద్రోహులు అతి వినయం ప్రదర్శిస్తూ మనలని మోసం చేస్తారు. అలాంటి వారిని కనిపెట్టి ఉండాలి.

లేకపోతే మన దేవశర్మగారికి జరిగిన మోసమే మనకి కూడా జరుగుతుంది.

Keywords: china pillala neeti kathalu, ashadhabhuti , ashaadhabhooti katha, dEva Sarma, bala kathAnithi, balAnandam, telugu lo bAla sAhityam

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com